ప్రజాశక్తి
సోమవారం 13 ఆగస్టు 2023 5 అనంతపురం



రుద్రంపేట పంచాయతీ

నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలి

సిపిఎం 2వ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రుద్రంపేట పంచాయతీ పరిధిలో నిధులు దుర్వినియోగంపై విచారణ జరిపించాలని, దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని సిపిఎం 2వ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రుద్రంపేట పంచాయతీ పరిధిలో ప్రజల సొమ్మును పంచాయతీ అభివృద్ధి కోసం ఉపయోగించకుండా పాలకులు, అధికారులు తమ జేబులు నింపుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. డ్రయినేజీ ర్వాటు చేయకుండానే నిధులు డ్రా చేసినట్లు, వీధి దీపాల కోసం, బ్లీచింగ్ పౌడర్, కార్మికుల దుస్తులు, పనిముట్లు, కొనుగోలులో చేతివాటం ప్రదర్శించినట్లు, వ్యక్తిగత ఖాతాలకు నిధులు జమ అయినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. అవినీతి జరిగిందని స్వయాన సర్పంచే విలేకరుల సమావేశంలో వెల్లడించిందన్నారు. జిల్లా కలెక్టర్ ఎమ్.గౌతమి, జిల్లా పంచాయతీ అధికారి ప్రబాకర్‌రావు జోక్యం చేసుకొని అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మంత్రి తనయుడా... మజాకా....



సొంతపనికోసం జిల్లాలో వారం రోజులు మకాం
ఆయన ఖర్చుకోసం మున్సిపల్ సిబ్బందితో వసూళ్లు
వసతి ఏర్పాట్లకు రూ. 3 లక్షల ఖర్చు
వసూళ్లపై సిబ్బందిలో వ్యతిరేకత



అనంతపురం నగర పాలకసంఘం కార్యాలయం

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

సాధారణంగా ఆయా శాఖల మంత్రులు జిల్లాల పర్యటనకు వచ్చినప్పుడు అయ్యే ఖర్చులు శాఖ పరంగా కానీ లేక సిబ్బంది తలా కొంత చందాలు వేసుకుని గాని భరిస్తారు. అయితే అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో అందుకు విరుద్దంగా ఓ మంత్రి తనయుడు అనంతపురం నగర పర్యటన ఖర్చును భరించాలని సిబ్బందితో వసూలు చేసిన ఘటన చర్చకు దారితీసింది. మంత్రి కుమారుడి పర్యటన సందర్భంగా ఆయన వసతి, భోజనం, వాహనం తదితర ఏర్పాట్లను చేయాలని మంత్రి పేషీ లోని పిఎ స్థాయి అధికారి మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందిని పురమాయించినట్లు సమాచారం. ఆ పిఎ గతంలో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా సైతం విధులు నిర్వర్తించారు. దీంతో ఆయన చెప్పింది తడవుగా మంత్రి తనయునికి మున్సిపల్ కార్పొరేషన్ ఎదురుగా ఉన్న విలాసవంతమైన హోటల్‌లో వసతి, భోజనం ఏర్పాట్లు, వాహన సౌకర్యం తదితర వాటిని దగ్గరుండి నిర్వహించారు. అయితే ఆయన ఏమైనా అధికార పర్యటన నిమిత్తం వచ్చారా అనుకుంటే పొరపాటు పడినట్లే. స్థానిక భైరవ నగర్ లో నిర్మాణంలో ఉన్న తమ భవంతిని పరిశీలించటానికి వచ్చినట్లు సమాచారం. ఆయన వారం రోజుల జిల్లా విడిదికి అయిన ఖర్చు రూ. 3 లక్షలుగా తేల్చారు. లాడ్జిలో ఉన్నందుకు రూ.80వేలు, వాహన ఖర్చు రూ.35వేలు, ఇతర ఖర్చులు 25 వేల రూపాయలు అంటూ మూడు లక్షలకు జాబితా సిద్ధం చేశారు. విభాగాల వారిగా ఇందు నిమిత్తం వసూళ్ల పర్వం ప్రారంభించారు. ఎక్కడా ఎన్నడూ చూడని విధంగా సాధారణంగా అయ్యే ఖర్చుకు మూడింతలు వంతున వసూళ్ల పర్వం చేపట్టటంపై కొంతమంది సిబ్బంది అసహనం చెంది తమ వ్యతిరేకతను వ్యక్తం చేసినట్లు తెలిసింది. మంత్రి వస్తే ఖర్చు చేశామంటే డబ్బులు ఇవ్వచ్చు కానీ ఆయన తనయుడు, వారి బంధువులు వచ్చారంటూ వసూళ్లు చేపట్టడం ఏమిటని వారు ప్రశ్నించినట్లు తెలిసింది. రోజుకు వాహనంలో నగరంలో తిరిగినా రూ. 2వేలు మించి రాదని ఒకవేళ హిందూపురం లేదా మడకశిర పర్యటనకు వెళ్లినా ఖర్చు రూ. 4వేలకు మించదని అలాంటిది వారం రోజులకు వాహన ఖర్చు రూ. 35వేలు అని చెప్పడం వింతగా ఉందని పలువురు వ్యాఖ్యానించినట్లు సమాచారం. అలాగే ఎంత ఖరీదైన లాడ్జి అయినా వారానికి 30 వేల రూపాయలు మించి ఖర్చు రాదని, ఇతర ఖర్చులు భోజనం ఖర్చులు ఇవన్నీ తడిసి మోపెడు ఎలా అవుతాయని వారు ప్రశ్నించినట్లు తెలిసింది. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతిదీ వింతైన ఖర్చని వారు వ్యాఖ్యానించినట్లు సమాచారం. ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్ లో ఉన్నతాధికారికి సదరు పిఎకి సాక్షాత్తు సోదరుడే కావడం విశేషం. కాని ఆ ఉన్నతాధికారి అనారోగ్య కారణంగా రెండు మూడు నెలలు పైగా సెలవులు ఉన్న సమయంలోనే ఈ తంతు జరిగినట్లు తెలిసింది. అయితే ఆ అధికారికి తెలియకుండా ఈ వ్యవహారం జరిగి ఉండదని కూడా ఉద్యోగ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఇదిలా ఉండగా కార్పొరేషన్‌లోని మరో అధికారి ఆడింది ఆట.. పాడింది పాట అన్న చందంగా వ్యవహారం నడుస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. పనిగట్టుకుని మున్సిపల్ ఆర్‌డి కార్యాలయంలో ఆయన సమావేశాలు నిర్వహిస్తూ సిబ్బందిని ఇబ్బందుల పాలు చేస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఆయన వసూళ్ల పర్వం కూడా ఎక్కువగా జరగుతున్నట్లు ఆరోపణలు వినపడుతున్నాయి. ఆయన తన ఇంటికి అవసరమయ్యే రెండు ఏసీలు, ఫ్రిడ్జి, డైనింగ్ టేబుల్, సోఫా సెట్లు ఇలా వరుసగా అన్నిటిని సమకూర్చటానికి ఆయనకు ఇష్టమైన ఉద్యోగికి నగరంలో అధిక వార్డులను కేటాయించి పెద్దపీట వేశారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ఇతర ఉద్యోగులు తీసుకొచ్చే ప్రజల అర్జీలను ఆ ఉద్యోగి ఓకే చెప్తే కానీ ఉన్నతాధికారి సంతకాలు చేసే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఆయన ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహించిన మూడు నెలల కాలంలో అర్జీల పరిష్కారంలో జరుగుతున్న జాప్యాన్ని సాకుగా చూపి పలువురికి మెమోలు సైతం జారీ చేశారన్న అభిప్రాయాలు వినపడుతున్నాయి. పర్యవేక్షకాధికారిగా అర్జీలను పరిష్కరించకుండా సిబ్బందిని బాధ్యులు చేయటం ఏమిటన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొంటూ పైగా వసూళ్ల పేరుతో అందరిని ఒకేలాగా చూస్తూ వసూలు చేయటం తగదని పలువురు సిబ్బంది వ్యాఖ్యానిస్తున్నారు. ఇదిలా ఉండగా మూడు మాన్యువల్ ఫైళ్లను ఆన్‌లైన్‌తో సంబంధం లేకుండా సిఎఫ్ఎంఎస్ చేయాలని ఒక ఇంజనీరింగ్ అధికారిపై ఒత్తిడి చేసినట్లు తెలిసింది. అయితే అందుకు ఆ అధికారి తిరస్కరించినట్లు సమాచారం. ఆన్‌లైన్ ఫైల్ లేకుండా మాన్యువల్ ఫైల్ తో సిఎఫ్ఎంఎస్ చేయటం కుదరదని ఖరాఖండిగా తేల్చి చెప్పినట్లు తెలిసింది. లక్షల రూపాయల విలువ చేసే ఆ ఫైల్ వెనక్కు తిప్పి పంపడానికి ఈ వసూళ్ల పర్వానికి ఏమైనా లింక్ ఉందా అన్నది కార్పొరేషన్ ఉద్యోగుల్లో చర్చ సాగుతోంది. మంత్రి తనయుడు పర్యటనకు చేపట్టిన వసూళ్ల పర్వంపై అటు కాదనలేక ఇటు లేదనలేక విభాగాధికారులు తలలు పట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ వసూళ్ల వ్యవహారాన్ని సిబ్బంది బాహాటంగానే చర్చించుకుంటూ ఉండటం విశేషం. దీనిపై కార్పొరేషన్ ఉన్నతాధికారి ఏ విధంగా స్పందిస్తారన్న అంశంపై ఆసక్తి నెలకొంది. నిజంగా మంత్రి తనయుడు పర్యటన ఏర్పాట్లపై వసూళ్ల పర్వం వారి కనుసన్నలలోనే కొనసాగించారా లేక మంత్రి పేషీ పిఎ అధికారి సూచనలతో ఇన్‌ఛార్జి అధికారి ప్రమేయంతో సాగిందా అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న నాగేంద్రకుమార్

అంగన్వాడీల సమస్యలపై స్పందించకుంటే

రాష్ట్ర ప్రభుత్వానికి రాజకీయ సమాధే...

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వీడకుండే వైసిపి ప్రభుత్వానికి రాజకీయ సమాధి తప్పదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో అంగన్‌వాడీలకు సిఐటియు ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్య పరిష్కరించకపోతే అంగన్‌వాడీల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాకతప్పదని హెచ్చరించారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కార్మికులు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. హామీ అమలు చేయకపోతే సెప్టెంబర్‌లో నిరవధిక సమ్మె తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా జూలై 10, 11 తేదీలలో 36 గంటల నిరసన కార్యక్రమాలు చేసినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఇలాంటి విధానాలే అనుసరించిన గత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని గద్దె దించారని గుర్తు చేశారు. ఇచ్చే రూ.10వేల వేతనానికే స్వర్గం అంటే ఎంఎల్‌ఎలు, మంత్రులకు ఇస్తున్న లక్షల వేతనాలకు ఏమనాలని ప్రశ్నించారు. మొండి వైఖరి వీడి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల మద్దతుతో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జమున, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇస్తున్న జేసీ కేతన్‌గార్గ్

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఈ నెల 15వ తేదీన నిర్వహించే స్వాతంత్ర దినోత్సవ వేడుకల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో 77వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణలో భాగంగా ముందస్తు ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మైదానంలో తిరిగి కార్యక్రమాలకు సంబంధించిన పనులపై ఆయా శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. జాతీయ పతాకావిష్కరణ, వివిఐపిలకు, ప్రజలకు, విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు రాకూడదన్నారు. సిట్టింగ్ ఏర్పాట్లు, పోలీస్ మార్చ్ ఫాస్ట్, శకటాల ప్రదర్శన, ఆహుతులకు తాగునీటి సౌకర్యం, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, అవార్డుల ప్రధానం, తదితర ఏర్పాట్లపై దృష్టిసారించాలని ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు. పెరేడ్ గ్రౌండ్లో బ్యారికేడ్ల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం కల్పన, విద్యుత్ సరఫరా, మెడికల్ క్యాంప్ ఏర్పాటు, అంబులెన్స్ సిద్ధంగా ఉంచడం, తదితర అన్ని రకాల ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు విజయ భాస్కర్ రెడ్డి, హనుమంతు, ఆర్‌డిఒ మధుసూదన్, హౌసింగ్ పీడీ కేశవ నాయుడు, డిఇఒ సాయిరాం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, డిపిఆర్ఒ గురుస్వామి శెట్టి, డిపిఒ ప్రభాకర్ రావు, జెడిఎ ఉమామహేశ్వరమ్మ, ఎపిఎంఐపి పీడీ ఫిరోజ్ ఖాన్, ఉద్యాన శాఖ డీడీ రఘునాథరెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..

అతివేగంగా వెళ్తున్న 'జిందాల్' వాహనాలు
తరచూ ప్రమాదాలతో స్థానికుల భయాందోళన
టిప్పర్లను ఆపి బొమ్మనహాల్ వాసుల నిరసన

ప్రజాశక్తి-బొమ్మనహాల్



ఆగిన టిప్పర్లు

అతివేగంగా వెళ్తున్న వాహనాల కారణంగా మనుషుల ప్రాణాలతోపాటు ఎన్నో జీవాలు మృత్యువాత పడుతున్నా పట్టించుకోరా.. అంటూ బొమ్మనహాల్ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు మండల కేంద్రంలో అతివేగంగా వెళ్తున్న జిందాల్ పరిశ్రమ వాహనాలను ఆపి నిరసన తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ వాహనాలను నిలిపివేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించినా ససేమిరా అన్నారు. సర్దిజెప్పే ప్రయత్నంలో మాటామాటా పెరిగింది. దీంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టకేలకూ సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఇకపోతే మండలంలోని అరే సముద్రం రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేసిన జిందాల్ ఐరన్ ఫోర్ కర్మాగారానికి కర్ణాటక నుంచి రోజూ సుమారు 300 నుంచి 500 టిప్పర్ల ముడి సరుకును రవాణా చేస్తారు. ఆయా వాహనాలు అతివేగంగా వస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా పాఠశాలలకు విద్యార్థులు వెళ్లేటప్పుడు.. వచ్చేటప్పుడు చాలా భయాందోళన చెందుతున్నారు. ఇలా పాఠశాలలకు వెళ్తున్న సమయంలో గతంలో బొమ్మనహాల్‌లోని సిద్ధేశ్వరస్వామి పాఠశాల సమీపంలో వేగంగా వెళు తున్న టిప్పర్ ఢీకొని ఓ విద్యార్థి మృతిచెందిన విషయం తెలిసిందే. అలాగే ఎలమెంటరీ పాఠశాల వద్ద కూడా మరో బాలుడు మృతిచెందాడు. ఇలా తరచూ జరుగుతూనే ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా మితిమీరిన వేగంతో వాహనాలు వెళ్తున్న కారణంగా దుమ్మూధూళితో ఆయా ప్రాంతాలు కప్పేస్తున్నాయని అంటున్నారు. దుమ్మూధూళి కారణంగా ఎన్నో కోళ్లు, కుక్కలు, గొర్రెలు వంటివి మృతిచెందుతున్నాయి. 1992లో పరిశ్రమ ఏర్పాటు చేసే సయయంలో పరిశ్రమకు వచ్చే భారీ వాహనాలు హైవే ద్వారా వెళ్తామని యాజమాన్యం హామీ ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం, జిందాల్ పరిశ్రమ యాజమాన్యం స్పందించి టిప్పర్లతోపాటు భారీ వాహనాలు వెళ్లేందుకు ప్రత్యేక రోడ్డు వేసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 3కె రన్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



3కె రన్‌లోపాల్గొన్న ఇండియన్ టెస్ట్ క్రికెటర్ హనుమ విహారి, ఇండియా మహిళా క్రికెటర్ అనూషా, డిప్యూటీ మేయర్ కొగటం, తదితరులు

ఆగస్టు 16 నుంచి 27వ వరకూ వైజాగ్‌లో నిర్వహించనున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ రెండవ సీజన్‌ను పురస్కరించుకుని ఇండియన్ టెస్ట్ క్రికెటర్, రాయలసీమ కింగ్స్ జట్టు కెప్టెన్ హనుమ విహారి, టీం సభ్యులతో కలిసి ఆదివారం నిర్వహించిన 3కె రన్ ఆకట్టుకుంది. నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ కళాశాల నుంచి ప్రారంభమైన రన్ ఆర్ట్స్ కళాశాల వరకూ సాగింది. ఈరన్‌లో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ఎడిసిఎ కార్యదర్శి మధు, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, కోచ్ మధుసూదన్‌రెడ్డి, రాయలసీమ కింగ్స్ జట్టు హెడ్ కోచ్ శ్రీవాస్‌రెడ్డి, రంజి జట్టు మాజీ ఆటగాడు ప్రసాద్‌రెడ్డి, క్రికెట్ కోచ్ టీవీ చంద్రమోహన్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, నరసింహారెడ్డి, జిల్లా క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రికెటర్ హనుమ విహారిని సన్మానిస్తున్న డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

ఉప మేయర్ నివాసంలో విందు

3కే రన్‌లో హాజరైన ఇండియన్ టెస్ట్ క్రికెటర్ హనుమ విహారి, ఇండియా మహిళా క్రికెటర్ అనూషాకు నగర డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి నివాసంలో విందే ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఇద్దరినీ కుటుంబ సభ్యులు సన్మానించి అభినందనలు తెలిపారు.

గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలి : సిఐ

ప్రజాశక్తి-పుట్లూరు



ప్రజలతో మాట్లాడుతున్న సిఐ వేణుగోపాల్

గ్రామీణ ప్రజలు ప్రశాంతంగా జీవించాలని పుట్లూరు సీఐ వేణుగోపాల్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. ఒకవేళ ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

చారిత్రక కట్టడాల భద్రతకు చర్యలు

జిల్లా టూరిజం శాఖ ఏడీ నాగేశ్వర్ రెడ్డి





జిల్లా టూరిజం శాఖ ఏడీ నాగేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా చారిత్రక కట్టడాలకు పర్యాటక ప్రదేశాలకు నిలయమని, వీటి భద్రతకు తగిన చర్యలు తీసుకుంటున్నామని శ్రీ సత్య సాయి జిల్లా టూరిజం శాఖ ఏడీ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

ప్రశ్న : శ్రీ సత్య సాయి జిల్లాలో టూరిజం అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు: సత్య సాయి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. పెనుగొండ, లేపాక్షి ,పుట్టపర్తి, హేమావతి ,తిమ్మమ్మ మర్రిమాను ,యోగివేమన ప్రసిద్ధి చెందిన ప్రాంతాలు. వీటి అభివృద్ధికి పలు చర్యలు చేపడుతున్నాం. ఆ ప్రాంతాలలో పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా పెనుగొండ కొండపైకి రహదారి ఏర్పాటు, లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నిర్మాణానికి చర్యలు, ప్రైవేట్ భాగస్వామ్యంతో రెస్టారెంట్ల నిర్వాహణ, పర్యాటకులకు విడిది గృహాలు తదితర సౌకర్యాలను ఆయా పర్యాటక ప్రాంతాల్లో చేపడుతున్నాం.

ప్ర పెనుకొండ కొండపైకి రోప్ వే నిర్మాణాలు ఎప్పుడు చేపడతారు..?

జ : ఆంధ్రప్రదేశ్లో ఎక్కడా లేనటువంటి శిల్ప సంపద పెనుగొండ కోట చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉంది. పెనుగొండ పట్టణం చారిత్రక పట్టణంగా గుర్తించాం. పర్యాటక ప్రదేశాలను కాపాడడానికి ఎన్నో చర్యలు చేపడుతున్నాం. వీటిని అభివృద్ధి చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు వెచ్చించనున్నాయి. లక్ష్మీ నరసింహ స్వామి కొండపైకి రోప్‌వే నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోపే వే నిర్మాణం జరిగితే పర్యాటక రంగంగా పెనుగొండ మరింత అభివృద్ధి చెందుతుంది.

ప్ర : పుట్టపర్తిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి కొత్త ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా.?

జ : పుట్టపర్తిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి శ్రీ సత్య సాయి బాబా మందిరంతో పాటు చుట్టుపక్క ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నాం. సత్యసాయి దర్శనార్థం ఎంతోమంది దేశ విదేశీయులు భక్తులు పుట్టపర్తికి వస్తుంటారు. వారిని దష్టిలో ఉంచుకొని పుట్టపర్తి పరిసర ప్రాంతాలైన చిత్రావతి నది బ్యూటిఫికేషన్, బుక్కపట్నం చెరువు అభివృద్ధి పనులు, అందులో బోటింగ్, శిల్పారామం తదితర ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. పర్యాటకులను ఆకట్టుకునే విధంగా పుట్టపర్తి పరిసర ప్రాంతాలను సుందరీకరణంగా తీర్చిదిద్దడానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపాము.

ప్ర : కొత్త టూరిజం సర్క్యూట్ కు చర్యలు ఏవి.

జ : పుట్టపర్తి ,పెనుగొండ, లేపాక్షి ,కదిరి, తిమ్మమ్మ మర్రిమాను, యోగివేమన తదితర పర్యాటక ప్రాంతాలను కలుపుతూ ఒక పర్యాటక బస్సును ఏర్పాటు చేసి పుట్టపర్తి నుండి ఉదయం బయలుదేరి రాత్రి లోపు వీటన్నింటిని తిరిగి వచ్చే విధంగా ఏర్పాటు చేసి కొత్త టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలని చర్యలు చేపడుతున్నాం. దీనివలన తక్కువ ఖర్చుతో పర్యాటక ప్రాంతాలను ప్రజలు వీక్షించేందుకు అవకాశం కలుగుతుంది. ఈ టూరిజం సర్క్యూట్ ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నాము. కేంద్ర నిధులతో సత్యసాయి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి మరింత కృషి చేస్తాము.

అత్యాధునిక పరికరాలతో వైద్య పరీక్షలు

శ్రీలక్ష్మీవెంకటేశ్వర చెస్ట్ అండ్ అలర్జీ క్లినిక్‌లో మెరుగైన సేవలు

డాక్టర్ రంగు సుధీంద్ర


అత్యాధునిక వైద్య పరికరం, (ఇన్‌సెట్‌లో) డాక్టర్ రంగు సుధీంద్ర

ప్రజాశక్తి-అనంతపురం

ప్రజల సౌకర్యార్థం ఊపిరితిత్తుల సమస్యలను గుర్తించేందుకు అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు శ్రీలక్ష్మీ వెంకటేశ్వర చెస్ట్ అండ్ అలర్జీ క్లినిక్ డాక్టర్ రంగు సుధీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా చెస్ట్ అండ్ అలర్జీ వైద్య సేవలను అందిస్తున్న తాము ప్రజలకు ఊపిరితిత్తుల సమస్యలను గుర్తించి మెరుగైన వైద్యం అందించేందుకు ఆధునిక వైద్య నిర్ధారణ పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. అలెర్జీల చికిత్సలో మొదటి దశ (ఆస్తమా లేదా అలెర్జిక్ రైనిస్) అలెర్జీ కారకాలకు గురికాకుండా నిరోధించడం. అలెర్జీ కారకాన్ని గుర్తించడానికి - క్లినిక్‌లో ఇన్‌స్టాల్ చేసినట్లు చెప్పారు. అలెర్జీ కారకాల కోసం స్క్రీనింగ్ టెస్ట్, వందకు పైగా అలెర్జీ కారకాలను, రక్త నమూనా ద్వారా 4 గంటల సమయంలో గుర్తించవచ్చునని చెప్పారు. సిపిడ్ జనెక్స్‌పెర్ట్ మెషిన్‌ను క్లినిక్‌లో ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ మిషన్ ద్వారా ఎంటిబి పాజిటివిటి, రిఫాంపిసిన్ రెసిస్టెన్స్ ఇన్ 70 ఎంటిఏస్, మరింత ముఖ్యమైన ఎంటిఆర్ ప్యానల్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఐసోనియాజిడ్, ఫ్లూరోక్వినోలోన్స్, సెకండ్-లైన్ ఇంజెక్టబుల్ డ్రగ్ (అమికాసిన్, కనామైసిన్, కాప్రోమైసిన్), ఇథియోనామైడ్ 90 నిమిషాల కంటే తక్కువ సమయంలో అన్ని రకాల సంబంధిత వ్యాధి నిర్ధారణ పరీక్షలను పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైస్‌మిల్ తిమ్మప్పకు నివాళి


తిమ్మప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి దంపతులు

ప్రజాశక్తి-కణేకల్లు

మండల వైసిపి సీనియర్ నాయకులు, జడ్పిటిసి డి.పద్మావతి భర్త తిమ్మప్ప మృతికి పలువురు నివాళులర్పించారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, సతీమణి, జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షురాలు కాపు భారతి, ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ సర్పంచి షేక్ ఫక్రుద్దీన్, తదితరులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విప్ కాపు మాట్లాడుతూ తనకు సోదర సమానులైన రైస్‌మిల్ తిమ్మప్ప లేనిలోటు తీర్చలేనిదన్నారు. అందరినీ ప్రేమాభిమానాలు, ఆప్యాయంగా పలకరించే తిమ్మప్ప మరణించడం చాలా బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

16న సర్వసభ్య సమావేశం

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఈనెల 16వ తేదీన ఎంపిపి రాఘవరెడ్డి అధ్యక్షతన సర్వసభ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచులు, మండలంలోని వివిధ శాఖల అధికారులు తదితరులు హాజరు కావాలని కోరారు.

టిడిపిని బలోపేతం చేయాలి

యాడికి : మండలంలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయాలని టిడిపి ప్రొఫెషనల్ వి ంగ్ రాష్ట్ర సెక్రటరీ నయీం, శ్యామ్‌సుందర్‌రెడ్డి తెలి పారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలో టి డిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడుతో చర్చిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి కి అనుబంధ విభాగమైన టిడిపి ప్రొఫెషనల్ వింగ్ మెంబర్‌షిప్ కార్యక్రమాన్ని మండలంలో చేపట్టాలని కోరరు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రొఫెషనల్స్ వివరాలను తమక అందించాలని తెలిపారు.

ఓటరు సర్వే పరిశీలన

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని చెర్లోపల్లి, కడవకల్లు గ్రామాల్లో చేపట్టిన ఇంటింటి సర్వేను నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారిణి సుధారాణి ఆదివారం పరిశీలించారు. ముందుగా ఆయా పోలింగ్‌స్టేషన్లను పరిశీలించారు. అనంతరం బిఎల్‌ఓలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటరు సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఎల్‌ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను పరిశీలించి నూతన ఓటర్లుగా ఉంటే నమోదు చేయడం, ఒకవేళ చనిపోయి ఉంటే తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మోహన్‌కుమార్, బిఎలఒలు, తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : ఓటర్ నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తహశీల్దార్ ఉషారాణి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో చేపట్టిన ఇంటింటి ఓటరు సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ బిఎల్‌ఓలు ఎలాంటి తప్పులు లేకుండా ఓటరు జాబితాను తయారు చేయాలని సూచించారు.


గార్లదిన్నె మండలం కల్లూరులో బిఎల్‌ఓలతో చర్చిస్తున్న తహశీల్దార్ ఉషారాణి


ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

ఉరవకొండ : మండలంలోని మూలగిరిపల్లిలో టాటా విండ్ పవర్, మండల పరిషత్ నిధులతో సంయుక్తంగా నిర్మించిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఎంపిపి చంద్రమ్మ, జడ్పిటిసి పార్వతమ్మ, వైస్ ఎంపిపి నరసింహులు, నాయకులు మూలగిరిపల్లి ఓబన్న, టాటా సంస్థ ప్రతినిధులు సుదర్శన్‌నాయక్, రాకెట్ల అశోక్‌కుమార్, సర్పంచి శ్రీరాములు, ఉప సర్పంచి వెంకటరెడ్డి, ఎంపిటిసి ఓబయ్య, బెస్త, కురుబ, ఎంబిసి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్లు రమణ, గోవిందు, జోగి వెంకటేష్, తేజోనాథ్, పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు బసవరాజు, ఏసీ ఎర్రిస్వామి, ఆసీఫ్, గ్రామ నాయకులు బసవరాజు, రామాంజనేయులు, రమేష్, భాస్కర్, ఎర్రిస్వామిరెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం

అంగన్‌వాడీల్లో పని చేస్తున్న టీచర్లు, హెల్పర్లకే కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని బాలుర హైస్కూల్‌లో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి మేరీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విస్మరించడం ఎంత మేరకు సమంజసమని ప్రశ్నించారు. గతనెలలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు అనంతపురం కలెక్టరేట్ ముందు రెండు రోజులపాటు దీక్షలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. అంగన్‌వాడీలకు వెంటనే కనీస వేతనంతోపాటు పిఎఫ్ ఈఎస్‌ఐ గ్రాట్యూటీ తదితర తదితర సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఇదివరలో 90 శాతం కేంద్ర ప్రభుత్వం, 10శాతం రాష్ట్రప్రభుత్వం ఐసిడిఎస్‌కు బడ్జెట్ కేటాయించే వారిని, ఇప్పుడు దాన్ని కేంద్రం 60 శాతం, రాష్ట్రానికి 40 శాతం కేటాయించడం చూస్తుంటే అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి పూనుకున్నాయని అర్థం అవుతోందన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా కేంద్ర, రాష్ట్ర పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ఐసిడిఎస్ బలోపేతానికి కేంద్ర బడ్జెట్‌లో సరిపడ బడ్జెట్ కేటాయించాలని, అంగన్‌వాడీలను వర్కర్లుగా కాకుండా ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు శివ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు బేబీ, నాయకురాలు మెహ్రూన్, రాధిక, రాధమ్మ, రుద్రమ్మ, అనురాధ, గోవిందమ్మ, రూప, వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపుతాం..

జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్


మహిళలకు నమస్కరిస్తున్న జనసేన జిల్లా అధ్యక్షులు ఇన్‌ఛార్జి టిసి వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీని ఆదరిస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపుతామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ఇన్‌ఛార్జి టిసి వరుణ్ కోరారు. జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలను వివరిస్తూ అధికారంలోకి వస్తే చేయబోయే అభివృద్ధిపై రూపొందించిన మేనిఫెస్టోను వివరిస్తూ చేపట్టిన జనసేన జయభేరి కార్యక్రమం ఆదివారం 41వ డివిజన్‌లోని జనశక్తి నగర్‌లో అట్టహాసంగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము మాటలు చెప్పేరకం కాదని, అధికారంలోకి వస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తామన్నారు. అన్నివిధాలా మీకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా కాలనీలో డ్రెయినేజీ వల్ల అనారోగ్య బారిన పడుతున్నా, స్థానిక ఎమ్మెల్యే ఇలాంటి చొరవ తీసుకోలేదని వాపోయారు. వైసిపి ప్రభుత్వంలో ఏ ఒక్కరికీ న్యాయం జరగడం లేదన్నారు. కావున జనసేన పార్టీని గెలిపిస్తే అనంత నగర రూపురేఖలే మారిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శులు కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు సంజీవరాయుడు, చొప్ప చంద్ర, కిరణ్‌కుమార్, సిద్ధూ, జయమ్మ, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, రోళ్ల భాస్కర్, దరాజ్ బాషా, నగర కార్యదర్శులు సువర్ణమ్మ, కుమ్మర మురళి, విశ్వనాథ్, లాల్‌స్వామి, అంజి, సంపత్, వడ్డే వెంకటేష్, వెంకటరమణ, ఆకుల అశోక్, కార్యక్రమాల కమిటీ సభ్యులు సంతోష్‌కుమార్, నాయకులు చిరు, హిద్దు, రహీంబాషా, మహేష్, హర్ష, విజయ్‌దేవ్, నౌషాద్, వీరమహిళలు లావణ్య, సుజాత, మమత, రోహిణీ, అనసూయ, దాసరి సరిత, తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర ఎగువ కాలువకు నీరు విడుదల చేయాలి

కలెక్టర్ గౌతమికి మాజీమంత్రి 'కాలవ' లేఖ


కలెక్టర్ గౌతమికి రాసిన లేఖను చూపుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తుంగభద్ర ఎగువ కాలువ ఆయకట్టుకు సకాలంలో నీరు విడుదల చేయాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాలువ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో నెట్ ద్వారా కలెక్టర్ ఎమ్.గౌతమికి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురవని కారణంగా ఈ ఏడాది తుంగభద్ర రిజర్వాయరుకు ఆలస్యంగా నీళ్లు వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం టి.బి. డ్యామ్‌లో 89 టిఎంసిల నీరు నిలువ ఉందన్నారు. గతనెల 29న హెచ్ఎల్‌సి సరిహద్దుకు నీరు చేరిందన్నారు. అయితే గత నాలుగేళ్లుగా ఎగువ కాలువకు కనీస మరమ్మతులు కూడా చేయని కారణంగా మూడు రోజుల క్రితం 113వ కి.మీ వద్ద గండి పడిందన్నారు. దీంతో ప్రవాహం తగ్గించి దాన్ని తాత్కాలికంగా పూడ్చి వేయించారన్నారు. ప్రధాన కాలువకు పలుచోట్ల గట్లు బలహీన పడి ఎప్పుడు కోతకు గురవుతాయోనన్న ఆందోళన అధికారులను, రైతులను పీడిస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో సకాలంలో నాట్లు పడాలంటే వెంటనే ఆయకట్టుకు నీటిని విడుదల చేయాల్సిన అవసరం ఉందన్నారు. అయితే అధికారికంగా నీటి విడుదల తేదిని ఇంత వరకు ప్రకటించకపోవడంతో ఆయకట్టుదారుల్లో అయోమయం నెలకొందన్నారు. ఐఎబి సమావేశం ఏర్పాటు చేసి డిస్ట్రిబ్యూటరీలకు నీటి విడుదల తేదీలను ఖరారు చేస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నారన్నారు. కావున సత్వరం ఐఎబి సమావేశం ఏర్పాటు చేసి, సాధ్యమైనంత త్వరగా నీటిని ఆయకట్టుకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

సెపక్‌తక్రా క్రీడాసంఘం జిల్లా అధ్యక్షులు మల్లికార్జున


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సెపక్‌తక్రా క్రీడాసంఘం జిల్లా అధ్యక్షులు మల్లికార్జున

ప్రజాశక్తి-ఉరవకొండ

క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సెపక్‌తక్రా క్రీడాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ సెంట్రల్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు దావూద్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సెపక్‌తక్రా క్రీడా పోటీలను ప్రారంభించారు. ముందుగా అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ పతాకం ఆవిష్కరించారు. జిల్లావ్యాప్తంగా ఈ పోటీల్లో 16 బాల బాలికల క్రీడా జట్లు పాల్గొన్నాయి. ఇందులో భాగంగా బాలుర విభాగంలో ఉరవకొండ మహేశ్వరి ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు విన్నర్స్‌గా నిలిచారు ఉరవకొండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రన్నర్స్ గా నిలిచారు. తతీయ స్థానంలో బ్రహ్మసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. అదేవిధంగా బాలికల విభాగంలో కరూర్ మండల పరిధిలోని తట్రకల్లులో ఉన్న కేజీబీవీ బాలికల పాఠశాల విద్యార్థులు ప్రస్తుతం స్థానం, ఉరవకొండ మండల పరిధిలోని ఆమిదాల ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం ఉరవకొండలోనే మహేశ్వరి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ఉరవకొండ ప్రభుత్వ సెంట్రల్ హైస్కూల్లో జరిగిన జిల్లాస్థాయి సెపక్‌తక్రా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెపక్‌తక్రా క్రీడాకారుల సంఘం షాహిన్, మారుతీప్రసాద్, ఆయా పాఠశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'అనంత కరువు.. ఇనుప గజ్జల తల్లి' పుస్తకావిష్కరణ


'అనంత కరువు.. ఇనుప గజ్జల తల్లి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్త రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, అతిథులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం కరువు రైతు ఆత్మహత్యలు నేపథ్యంలో రూపొందించిన 'అనంత కరువు.. ఇనుప గజ్జల తల్లి' పుస్తకాన్ని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో పరిశోధాత్మకంగా అనంతపురం జిల్లా కరువు రైతుల ఆత్మహత్యలపై రచయిత ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పుస్తకాన్ని రాశారని తెలిపారు. ఆమె రాసిన సాహిత్యాన్ని సుదీర్ఘకాలం తర్వాత ఆమె భర్త చెట్ల ఈరన్న తెరపైకి తీసుకురావడానికి చేసిన కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు డాక్టర్ శాంతినారాయణ, బండి నారాయణస్వామి, మల్లారెడ్డి, మల్లెల నరసింహమూర్తి, పలువురు సాహితీవేత్తలు, శ్రేయోభిలాషులు, పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.


పెద్దాసుపత్రి వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ట్రస్టు ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని పెద్దాసుపత్రి వద్ద అన్నదా నం చేశారు. ట్రస్టు సభ్యులు, ప్రవాస భారతీయులు లక్ష్మీరెడ్డి సతీమణి అరుణ పెళ్లిరోజు సందర్భంగా అన్నదానం చేసినట్లు నిర్మలమురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కవిన్ ఆదిత్య, వరలక్ష్మి, సుబ్రమణ్యం, ఓబుళపతి, కిష్టప్ప, నబిరసూల్, చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నీటి తొట్టెలో పడి బాలుడు మృతి

గార్లదిన్నె : మండల పరిధిలోని సిరివరం గ్రామంలో ఆదివారం నీటి తొట్టెలో పడి బాలుడు నాని (13) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శింగనమల మండలం వెస్ట్ నరసాపురం గ్రామానికి చెందిన కురుబ గోపాల్, భార్య రోజా కుమారుడు నానితో కలిసి సిరివరంలో జరిగే పీర్లపండుగకు వచ్చారు. కుటుంబ సభ్యులు అందరూ పీర్ల పండుగలో నిమగ్నమై ఉండగా నాని తోటి పిల్లలతో కలిసి ఊరి బయట ఉన్న దోబీఘాట్‌కు ఈత కోసం వెళ్లాడు. ఈత కొడుతుండగా నీటి తొట్టెలో మునిగి చనిపోయాడు. తోటి పిల్లలు వచ్చి చెప్పడంతో కొడుకు మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతిచెందిన రాజశేఖర్

గుత్తి : మండలంలోని పూలకుంట గ్రామంలో రెండు రోజుల క్రితం పాముకాటుకు గురైన ఓ వ్యక్తి ఆదివారం మృతిచెందాడు. గ్రామానికి చెందిన గొర్రెలు కాపరి ఎన్.రాజశేఖర్ (40) ఈనెల 10న గొర్రెల మంద వద్ద నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన తోటి కాపరులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అతన్ని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

గుత్తి : మండలంలోని బాచుపల్లి గ్రామ సమీపంలో బాట సుంకులమ్మ ఆలయం ఎదురుగా 44వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. నంద్యాలకు చెందిన ఫయాజ్ అహ్మద్ కుటుంబ సభ్యులతో కలిసి గుత్తి ఆర్ఎస్‌లోని బంధువుల ఇంటికి కారులో బయలుదేరారు. బాట సుంకులమ్మ ఆలయ సమీపంలో ముందుగా వెళుతున్న లారీని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఫయాజ్ అహ్మద్ తోపాటు సికిందర్ హుస్సేన్, నియాజ్ అహ్మద్, కమల్ అహ్మద్ గాయపడ్డారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అదనపు చికిత్స కోసం క్షతగాత్రులను అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు...

గుత్తిలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఆదివారం కారు డివైడర్ ను ఢీకొంది. బెంగళూరు చెందిన కుటుంబం దైవదర్శనం కోసం మంత్రాలయంకు కారులో వెళ్లారు. దైవదర్శనం అనంతరం తిరిగి బెంగళూరుకు పయనమయ్యారు. గుత్తి పట్టణంలో ఆస్పత్రి సమీపంలో కారు టైరు పంచర్ కావడంతో వాహనం అదుపు తప్పి డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. అయితే కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల సెల్‌ఫోన్లు చోరీ

గుత్తి : పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాల వద్ద ఆదివారం విద్యార్థులకు చెందిన 8 సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. పామిడి చెందిన డిగ్రీ విద్యార్థులు పరీక్షల నిమిత్తం గుత్తిలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలకు వచ్చారు. 8 మంది విద్యార్థులు తమ మొబైల్ లను చైతన్య అనే విద్యార్థి స్కూటీలో ఉంచి తాళం వేసుకొని వెళ్లారు. అయితే పరీక్షల అనంతరం వచ్చి స్కూటీ తెరిచి చూడగా సెల్ ఫోన్లు కనిపించలేదు. చోరీకి గురైనట్లు గ్రహించి విద్యార్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తిపై హత్యాయత్నం

నార్పల : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి వ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. దొడ్డ ప్రకాష్‌రెడ్డి తలపై శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బండరాళ్లతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. గుర్తించిన స్థానికులు వెంటనే అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రకాష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

బేల్దారి ఆత్మహత్య

ధర్మవరం టౌన్ : పట్టణంలోని లోనికోటకు చెందిన చాంద్‌బాషా(40) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. లోనికోటకు చెందిన చాంద్‌బాషా బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అయితే మద్యం, తిరుగుళ్లకి అలవాటుపడిన అతడు ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. అతడికి భార్య షకీల, ఇద్దరు కుమారులున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నీటిగుంతలో పడి వ్యక్తి మృతి

బత్తలపల్లి : మూర్ఛ(ఫిట్స్)తో బాధపడుతున్న వ్యక్తి ఆరుబయట బహిర్భూమికి వెళ్లి ప్రమదవశాత్తూ నీటి గుంతలో పడి మృతి చెందిన సంఘటన ఆదివారం మండల పరిధిలోని సంగాల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరా లు.. సంగాల గ్రామానికి చెందిన సత్యనారాయణ(34) మూర్ఛతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులందరూ బంధువుల ఇంట్లో శుభకార్యానికి అప్పరాచెరువుకు వెళ్లారు. అతడు బహిర్భూమికి చిత్రావతి నదిలోకి వెళ్లి నీటి గుంతలో మృతి చెందాడు. అటుగా వెళ్తున్న సర్పంచి కంచనగారి రాజశేఖర్‌రెడ్డి గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీసి ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య సరోజమ్మ, ఇద్దరు పిల్లలు సంతానం ఉన్నారు. నీటి గుంత ఎక్కువ లోతు లేదని ఫిట్స్ వచ్చి అందులో పడి మృతి చెంది ఉంటాడని బంధువులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

చిలమత్తూరు : మండల పరిధిలోని కోడూరు గ్రామపంచాయతీ చిన్నపరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డిమేకలప్ప గారి వెంకటేష్(38) కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం అటుగా వెళ్లిన గ్రామస్థులు గమనించి కుటుంబ సభ్యులకి సమాచారం ఇచ్చారు. వెంకటేష్ కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడు తూ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నాడని, కడుపు నొప్పి తాళ లేక ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి

బుక్కపట్నం : మండల పరిధిలోని నాయనవారిపల్లి గ్రామానికి చెందిన మానసిక వికలాంగుడు దిలీప్‌కుమార్‌నాయక్(23) ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ నరసింహుడు తెలిపిన వివరాల మేరకు.. దిలీప్ కుమార్ ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడం, దీనికి తోడు తల్లిదండ్రులు ఎన్ని సంబంధాలు చూసినా వివాహం కుదరలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన దిలీప్ ఈ నెల 5వ తేదీ తన పొలంలో పురుగులు మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన బంధువులు వెంటనే కదిరి ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్య సేవల కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అయితు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. తండ్రి రామస్వామి నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ

పెనుకొండ : యుటిఎఫ్ పెనుకొండ జోన్ ఆధ్వర్యంలో రామాంజనేయులు జ్ఞాపకార్థం జరుగుతున్న టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం మ్యాచ్‌లను సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు హరి ప్రారంభించారు. ఈ సందర్భంగా రొద్దం,పెనుకొండ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.